క్లుప్తంగా

గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలి

హన్మకొండ కల్చరల్: గోవుల అక్రమ రవాణాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలి వరంగల్ మహానగర విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి శ్రీరామ్ ఉదయ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వరంగల్ అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, హనుమకొండ అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి, కాజీపేట్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పుప్పాల తిరుమలరావును విశ్వహిందూ పరిషత్ సభ్యులు శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. చట్టాన్ని ఉల్లంఘించి లారీ, ఆటోల్లోనే కాకుండా క్లోజ్డ్ కంటైనర్లలో అక్రమ గో రవాణా జరుగుతోందని, తక్షణమే చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గోరక్ష ప్రముఖ్ నంగునూరు నాగరాజు, ఓం కుమార్, పుప్పాల రాజు, దుపెల్లి అరవింద్, గూడూరు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి



నడికూడ : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ దశాబ్ది వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మండలంలోని ఆయా గ్రామాల స్పెషల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీఓ చిర్రబోయిన శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శాయంపేట : చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని చేనేత సొసైటీ మాజీ చైర్మన్, ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోల్ వీర మోహన్, ఈ నెల 3న శాయంపేట చేనేత సొసైటీని పాలకవర్గంతో సందర్శించనున్నట్లు తెలిపారు. చేనేత కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకుంటారని తెలిపారు. కార్మికులు కూడా తాము ఎదుర్కొంటున్న సమస్యలను కూలీ రేట్లు విషయాలను, చేనేత రాష్ట్ర కార్యవర్గం దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. చేనేత రంగాన్ని ఉపాధి హామీకి అనుబంధంగా చేర్పించాలనే యోచనలో ఉన్నట్లు తెలిపారు. సొసైటీలో కొత్త సభ్యత్వాల కోసం పద్మశాలి కులస్తులు చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గం దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. ఈ నెల 3న ఉదయం 11గంటలకు చేనేత సొసైటీలో జరిగే సమావేశానికి పద్మశాలి కులస్తులు, పవర్‌లూమ్ కార్మికులు, చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను విన్నవించుకోవాలని చంద్రప్రకాష్ కోరారు.

బాధిత కుటుంబాలకు బియ్యం అందజేత



దామెర: మండలంలోని ఊరుగొండ ఆటోడ్రైవర్ కుటుంబానికి శనివారం బియ్యం, నగదు అందించి అండగా నిలిచారు. గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కొడగానికి రంజిత్ తండ్రి దేవేందర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు బొల్లు రాజు 50 కిలోల బియ్యం అందజేశారు. అలాగే యూనియన్ సభ్యులు రూ.5000 నగదును ఆందజేశారు. వారివెంట అధ్యక్షుడు పాలెపాక రాజు, ప్రధాన కార్యదర్శి పాలెపాక రమేష్, సభ్యులు పాలెపాక రాజేందర్, నల్ల భిక్షపతి, నల్ల విజేందర్, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన జన్ను భద్రయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి ఆదేశాల మేరకు శనివారం ఎంపీటీసీ మేకల శ్రీనివాస్ పరామర్శించి ఆయన కుటుంబ సభ్యులకు 50 కేజీల బియ్యం అందజేశారు. ఆయన వెంట నాయకులు అట్ల తిరుపతి, మేకల వెంకన్న, అట్ల రమేష్, కర్రు రవీందర్, పసునూటి రాజయ్య, శంకర్, ప్రశాంత్, విష్ణు, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీతో తాగునీటి వృథా

- ఏడాది గడస్తున్నా పట్టించుకోని అధికారులు
- మరమ్మతు చర్యలు శూన్యం
- వృథా నీటితో ఏర్పడిన మురికిగుంత

శాయంపేట : గ్రామాల్లోని ప్రజలకు సురక్షితమైన నీరు అందించేందుకు గత ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పథకంలో నిర్మించిన వాటర్ ట్యాంక్‌లోకి నీరు ఎక్కించేందుకు ఏర్పాటు చేసిన పైపులైన్ వాటర్‌ట్యాంకు మొదటలో లీకేజీ ఏర్పడింది. ఏడాది గడుస్తున్నా అధికారులు మరమ్మతు పనులు చేపట్టడంలో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారు. దీంతో తాగునీరు వృథాగా పోయి వాటర్ లీకేజీ ప్రాంతంలో ట్యాంకు బలహీనపడే ప్రమాదం ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదు.

వివరాల్లోకి వెళ్లితే.. శాయంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆ రోగ్య కేంద్రం ఆవరణలో లక్ష ఇరవై వేల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ నిర్మాణం గత ప్రభుత్వం చేపట్టి మిషన్ భగీరథ నీటిని ఎక్కించేందుకు పైప్‌లైన్ వేయగా వాటర్ ట్యాంక్ చివరన పైప్‌లైన్ లీకేజీ అయి నీరు వృథాగా పోతుంది, అధికారులు సందర్శించి మరమ్మతు చేయించాలని సిబ్బందిని ఆదేశించినా ఏడాదిపైగా గడస్తున్నప్పటికి వరకు మరమ్మతుకు నోచుకోలేదు. దీంతో తాగునీరు వృథాగా పోయి ట్యాంక్ ప్రాంగణంలో బురదమయంగా మారి మురికిగుంత ఏర్పడింది. ఇంతే కాకుండా ఏడాదిపైగా తాగునీరు లీకేజీ అవడంతో వాటర్‌ట్యాంక్ లీకేజీ ప్రాంతం బలహీనపడి శిథిలమయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైనుకు మరమ్మతు చేసి తాగునీరు వృథా కాకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ట్యాంక్ కింద ఏర్పడిన గుంత



లీకవుతున్న ట్యాంక్ ఇన్‌ఫుట్ వాటర్

ఐదేళ్లు దాటిన పిల్లలను పాఠశాలల్లో చేర్చాలి



పరకాల: మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆంజనేయులు



నడికూడ: మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

పరకాల: ఐదేళ్ల దాటిన పిల్లలను పాఠశాలలో చేరేలా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం ఎంఈఓ రమాదేవి అధ్యక్షతన ఉపాధ్యాయులు, గ్రామైఖ్య సంఘాల అధ్యక్షులు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రైవేటు ప్రభుత్వ ఆలోచనను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన బోధనలు చేపట్టడంతో పాటు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఉచితంగా పుస్తకాలు అందచేస్తున్న విషయంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ నెల 3 నుంచి అన్ని గ్రామాల్లో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, బీఓఏలంతా ఓ టీంగా వెళ్లి ప్రతి రోజు సాయంత్రం వరకు రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్, ఉపాధ్యాయులు, వీఓలఏలు పాల్గొన్నారు.

బడి బాటను విజయవంతం చేయాలి

నడికూడ : బడి బాటను విజయవంతం చేయాలని ఎంపీడీఓ చిర్రబోయిన శ్రీనివాస్ అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో బడిబాటపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, పరీక్షల్లో విద్యార్థులు చూపిన ప్రతిభ వివరాలను తల్లిదండ్రులకు వివరించాలన్నారు. తహసీల్దార్ గుండాల నాగరాజు, మండల్ నోడల్ ఆఫీసర్ హనుమంతురావు, హెచ్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- పరకాల ఏడీఏ రవీందర్‌రెడ్డి



కమలాపూర్ : విత్తన దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న సీఐ హరికృష్ణ



దామెర : తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

దామెర: నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు రవీందర్ రెడ్డి హెచ్చరించారు. దామెర, ఊరుగొండలో అధికారులతో కలిసి ఫర్టిలైజర్, వి త్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లో ఉన్న స్టాక్, రికార్డులు పరిశీలించారు. అ నంతరం ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కృత్రిమ విత్తనాల కొరత సృష్టించి బ్లాక్‌లో అమ్మితే కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట తహసీల్దార్ జ్యోతివలక్ష్మీదేవి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఆర్‌ఐ భాస్కర్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

వేలేరు : మండల పరిధిలోని ఫర్టిలైజర్ షాపుల్లో నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి ఎల్.పద్మ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులో తహసీలీ్దార్ కోమి, ఎస్సై డి.హరితతో కలిసి విత్తనాల తనిఖీ నిర్వహించారు.

కమలాపూర్: నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ హెచ్చరించారు. కమలాపూర్ మండలంలోని మర్రిపల్లిగూడెంలో శనివారం ఆయన వ్యవసాయ అధికారులతో కలిసి విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆయా దుకాణాల్లోని రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. తనిఖీల్లో ఏఈఓ వినయ్‌వర్మ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు రశీదులు ఇవ్వాలి

ఐనవోలు: విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు షాపు యజమానులు రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారిణి అడప కవిత సూచించారు. శనివారం మండలంలోని పంథిని, కక్కిరాలపల్లి, నందనం, ఐనవోలు గ్రామాల్లోని విత్తన విక్రయ దుకాణాలను వ్యవసాయ, పోలీస్‌శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. పంథిని ఆగ్రోస్, నందనం వాసవి ఫర్టిలైజర్, సోమేశ్వర, ఓం శ్రీ, లక్ష్మి ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసిన అధికారులు వివిధ కంపెనీల ఇన్‌వాయిస్, విత్తన స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్కులను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల్లో ఎంఏఓ అడప కవిత, ఎస్సై అనిల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

శాయంపేట : విత్తన లైసెన్స్ కలిగి ఉన్న డీలర్ల వద్ద మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారి గంగాజమున సూచించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశాల మేరకు వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖల సంయుక్తంగా మండల టాస్క్‌ఫోర్స్ టీమ్‌గా ఏర్పడి శనివారం మండలంలోని ఫర్టిలైజర్ షాపులను ఆమె ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను, బిల్లు బుక్‌లను, లైసెన్సులను, విత్తనాలను, ఎరువులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మార్వై శరత్‌కుమార్, ఏఆర్‌ఐ హుస్సేన్, హెడ్ కానిస్టేబుల్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం మాణిక్యాపూర్‌లోని విత్తన దుకాణం షాపును శనివారం ఏఈఓ నాగరాజు, ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా షాపులోని విత్తన సముదాయ రిజిష్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. నకిలీ విత్తనాలు రైతులకు అంటగట్టినట్లు తెలిస్తే ఎంతటి వారైనా సరే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోకతప్పదని హెచ్చరించారు.

నడికూడ: నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ గుండాల నాగరాజు అన్నారు. మండలంలోని నడికూడ, వరికోల్, నార్లపూర్, చర్లపల్లి ఫర్టిలైజర్ షాపుల్లో శనివారం తహసీల్దార్ ఏఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. వారి వెంట పోలీస్, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.



ఐనవోలు: తనిఖీ చేస్తున్న ఎంఏఓ అడప కవిత



వేలేరులో...



శాయంపేటలో..



ఎల్కతుర్తి : వంగరలో..



నడికూడ : తనిఖీ చేస్తున్న తహసీల్దార్ నాగరాజు

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

వేలేరు : మండలంలోని పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ప్రజలు శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలోని ఎర్రబెల్లిలో రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ బాదావత్ వీరస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో హనుమకొండ రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు మహాన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎడవెల్లి మాధవరెడ్డి, దొడ్డ ఈశ్వరయ్య, మాజీ ఉపసర్పంచ్ అల్లం సతీష్, రమేష్, వరుణ్, శ్రావణ్, కిషోర్, దయాకర్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

దామెర: మండల కేంద్రంలో హనుమాన్ దేవాయంలో ఆలయ కమిటీ చైర్మన్ పోలం కృపాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. స్వామివారిని జిల్లేడు పూలు, తమలపాకుల దండలతో అలంకరించారు. అనంతరం దూప, దీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు సబ్బయ్య శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పులుకుర్తిలో ఆంజనేయస్వామి ఆలయంలో అఖిలేశ్ శర్మ, ఊరుగొండలో శ్రీనివాసచార్యులు పూజలు నిర్వహించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

శాయంపేట : మండల కేంద్రంలోని శ్రీ మత్స్యగిరి స్వామి ఆలయం ఆవరణలో హనుమాన్ ఆలయంలో, శ్రీ శివ మార్కండేయస్వామి ఆలయ ప్రాగణంలోని పంచముఖ ఆంజనేయ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆరుట్ల శ్రీకృష్ణమాచార్యులు, మార్త రాజ్‌కుమార్‌లు పంచామృత అభిషేకాలు నిర్వహించి చందనం వేశారు. శివ మార్కండేయస్వామి ఆలయంలో హనుమత్ కవచ స్తోత్ర పారాయణ సహిత హోమాన్ని నిర్వహించారు.

ఐనవోలు : మండలంలోని పంథిని, కక్కిరాలపల్లి, రాంనగర్, నందనం, ఐనవోలు, ఒంటిమామిడిపల్లి, వెంకటాపూర్, గర్మిళ్లపెల్లి, కొండపర్తి, ముల్కలగూడెంలోని పలు ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. ఆ యా గ్రామాల్లో హనుమాన్ దీక్ష స్వీకరించిన స్వా ములు ప్రత్యేక పూజలు చేసి ఇరుముడి కట్టుకుని కొండగట్టుకు తరలివెళ్లారు. కొన్ని ఆలయాల్లో హనుమాన్ విగ్రహాలకు పంచామృతాలు, పండ్లరసాలతో అభిషేకించి తమలపాకుల మాలతో పూజించారు.

కొండగట్టుకు బయల్దేరిన స్వాములు

కమలాపూర్: మండల వ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. హనుమాన్ ఆలయాల్లో హనుమాన్ మాలధారులు, భక్తులు అర్చనలు, అభిషేకాలు వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 41 రోజుల పాటు నియమనిష్ఠలతో అంజన్న దీక్షలో తరించిన మాలధారులు కమలాపూర్‌లోని విశ్వపతి ఆలయంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో ఇరుముడులు కట్టుకుని కమలాపూర్‌లోని శ్రీ సువర్చలా సహిత ఆంజనేయస్వామిని, రామాలయంలో శ్రీ సీతారాములను దర్శించుకుని మాలవిరమణ కోసం కొండగట్టు, భద్రాచలం, పొన్నూరు, శ్రీశైలం, ఇల్లంతకుంట దేవాలయాలకు తరలివెళ్లారు. గ్రామాలన్నీ హనుమాన్, రామనామ స్మరణతో మార్మోగాయి. కార్యక్రమాల్లో అర్చకులు బూర శివానందం, హరీషాచార్యులు, శ్రీనివాసాచార్యులు, హనుమాన్ మాలధారులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండలకేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంతో పాటు మండలంలోని కటాక్షపూర్, గుడెప్పాడ్ గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అర్చకులు ఆరుట్ల కేశవమూర్తి, మాధవమూర్తి హనుమాన్‌కు ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కటాక్షపూర్‌లో జరిగిన ఉత్సవాలకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరయ్యారు.



ఆత్మకూరు : కటాక్షపూర్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



శాయంపేట : శివమార్కండేయ స్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు



కమలాపూర్ : ఇరుముడులు ధరించి మాల విరమణకు వెళ్తున్న హనుమాన్ మాలధారులు



వేలేరు : ప్రత్యేక పూజలు చేస్తున్న పెద్ది వెంకటనారాయణ గౌడ్ తదితరులు

చికిత్స పొందుతున్న మహిళ మృతి



లక్ష్మి మృతదేహం

ఎల్కతుర్తి : మే 30న విషపురుగు కుట్టిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జామున మృతి చెందిన సంఘటన భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన భూనార్సి లక్ష్మి(40) తన కుటుంబ సభ్యులతో కలిసి మే 30న రాత్రి తన ఇంటి ముందు కూర్చొని భోజనం చేసి వేసవికాలం కావడంతో ఇంట్లో ఉక్క పోస్తుందని తన ఇంటి ముందు గచ్చుపై పడుకున్నారు. తన ఎడమ చెవికింద ఏదో విషపురుకు కుట్టినట్టు కావడంతో వెంటనే బాధితురాలు అరచింది. దీంతో చుట్టుపక్కల వారు వచ్చి చూడగా కొద్ది దూరంలో నాగుపాము కనిపించింది. వెంటనే దానిని చంపేశారు. దీంతో బాధితురాలు స్పృహకోల్పోయి కింద పడిపోయింది. వెంటనే చికిత్స నిమిత్తం బాధితురాలిని 108 వాహనంలో ముల్కనూర్‌ని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో అక్కడి నుంచి ఎంజీఎం ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడ చిక్సిత్స పొందుతుండగా శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి భర్త వెంకటస్వామి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పిచ్చికుక్క కాటు..14 మందికి గాయాలు



కుక్క కరవడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం వచ్చిన బాధిత మహిళలు

శాయంపేట: మండల కేంద్రంలో పిచ్చికుక్క కరవడంతో 14 మందికి గాయాలయ్యాయి. శనివారం తెల్లవా రు జామున 3 గంటల ప్రాంతంలో.. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఇంట్లో నుంచి బయటకు వచ్చిన మాచర్ల విజయ్‌కుమార్‌పై పిచ్చి కుక్క మొదటగా దాడి చేసి గాయపర్చింది. శనివారం తైబజార్లో మామిడి పండ్లు విక్రయించడానికి వచ్చిన సాదు సమ్మక్కను ఉదయం 7గంటల ప్రాంతంలో కుక్క కరిచి గాయపర్చింది. మాచర్ల రేణుక, కడారి నర్మద, గడ్డం సాంబ, కూతురు మల్లయ్య, దండబోయిన బుచ్చమ్మ, కందగట్ల కళ్యాణి, రాచర్ల శారదతో పాటు కూతురు రాజును కుక్క గాయపర్చగా.. కూతురు రాజుతో పాటు గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ సిబ్బంది కర్రతో పిచ్చి కుక్కను కొట్టి చంపేశారు. 9 మంది స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లగా.. డాక్టర్ సాయికృష్ణ, సిబ్బంది ప్రథమ చికిత్స అందించి బాధితులకు వ్యాక్సిన్లు అందజేశారు. ఐదుగురు వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కి వెళ్లి చికిత్స చేసుకున్నట్లు డాక్టర్ సాయికృష్ణ తెలిపారు. శాయంపేటలో కేవలం ఒక్క రోజు 14 మందిని కుక్క కరిచిందని విషయం తెలియడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. మల్టీపర్పస్ సిబ్బంది కుక్కను చంపివేశారని తెలియడంతో ఊపిరి పీల్చుకున్నారు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని చిన్నపిల్లల వెంబడి, వాహనాలను వెంబడించడంతో ప్రమాదాల బారిన పడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భూవివాదంలో ఇరువురి ఘర్షణ

- ఇద్దరికి గాయాలు

వేలేరు : మండల కేంద్రానికి చెందిన మునిగడప సంపత్, సీసాల రాకేష్ కుటుంబ సభ్యులు వ్యవసాయ భూముల వద్ద వచ్చిన ఘర్షణలో ఇరువురు కొట్టుకున్న ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. వేలేరుకు చెందిన మునిగడప సంపత్, సీసాల రాకేష్ కుటుంబాల మధ్య గత కొన్నేళ్లుగా భూముల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి వ్యవసాయ బావి వద్ద కర్రలు, గొడ్డళ్లతో, ఇతర ఆయుధాలతో కొట్టుకోగా ఇరువురికి గాయాలయ్యాయి. వీరిలో రాకేష్ తలకు తీవ్ర గాయం కాగా, సంపత్ స్నేహితుడు రాంచందర్‌కు చేతికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఎస్సై డి.హరితను వివరణ కోరగా తమకు ఇంకా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

మూసివేసిన పాఠశాలలను తెరిపించాలి

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో మూసివేసిన ప్రభుత్వ పాఠశాలలను తెరిపించే విధంగా కార్యాచరణ చేపట్టాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నబోయిన తిరుపతి, జిల్లా అధ్యక్షుడు రఘుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి గొడిశాల సత్యనారాయణ కోరారు. ఈమేరకు అదనపు కలెక్టర్ వెంకటరెడ్డిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గత పదేళ్లలో సుమారు 6వేల పాఠశాలలు మూతబడినట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి గ్రామపంచాయతీలో ఒక పాఠశాల ఉండేవిధంగా చర్యలు తీసుకుంటామని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ బాధ్యులు సారయ్య, కుమారస్వామి,చక్రునాయక్, పాలకుర్తి సదానందం పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్ వెంకటరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న టీపీటీఎఫ్ రాష్ట్ర, జిల్లా బాధ్యులు

అమరుల త్యాగాలు వెలకట్టలేనివి



దామెర: తెలంగాణ ఉద్యమంలో అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గండు రాము అన్నారు. రాష్ట్ర ఆవతరణ వేడుకలను పురస్కరించుకొని మండల కేంద్రంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ అమరుల ఆశయాల సాధకోసం కృషి చేసిన మహానాయకుడని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎండీ.జాకిర్‌అలీ, ఎంపీటీసీ పోలం కృపాకర్‌రెడ్డి, నాయకులు దామెరుప్పుల శంకర్, గడ్డం సదీనందం, వేల్పుల ప్రసాద్, సోనబోయిన రాజు, మేరుగు సంపత్, దామెర ఆనందం, సుమన్, గుండా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.